దాంపత్య జీవితంలో స్త్రీ, పురుష వాదాలకి స్థానముండరాదని, సహజీవన సామరస్యానికి కావల్సింది పరస్పరావగాహన మాత్రమేనన్నది జీవన రాగం.

# గడుగ్గాయి

పువ్వు పుట్టగానే పరిమళించింది. భారతి పుట్టగానే ఏడవలేదు. 'ఛీ! ఆడదానిలా ఏడవడం ఏమిటి? అనుకుందో ఏమో!

సగం చచ్చి భారతిని కన్న తల్లి, పూర్తిగా చచ్చిపోయినంత బాధపడింది, ఇంత కష్టపడి కన్న పిల్ల ఏడవనే లేదని. మంత్రసాని గుండెల్లో రాయి పడింది, ఏం నెపం వేస్తారో అని. పురిటి గది బైట శుభవార్త కోసం ఎదురు చూస్తున్న తండ్రీ, ఇతర బంధువులూ క్షణం పాటు గాభరా పడ్డారు. అప్పుడు 'కంయ్!'మంది భారతి. 'హమ్మయ్య'! అని నిట్టూర్చారు అందరూ. తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. 'ఏడిచింది, ఏడిచింది' అని ఒకరితో ఒకరు చెప్పుకుని సంతోషించారు. "ఏం పిల్లమ్మా! 'గడుగ్గాయి!' అందర్నీ గాభరా పెట్టేసింది" అంది మంత్రసాని.

పురిట్లో సంపాదించుకున్న బిరుదు పుడకల వరకూ సార్థకం చేసుకోవాలని నిశ్చయించుకుంది భారతి. "ఆడదానిలా బతకడం నేర్చుకోవే" అని అరిచి గీపెట్టేది అమ్మ. 'అది మాత్రం అసాధ్యం అంది భారతి.

భారతి పుట్టేనాటికి తండ్రి సీతారామయ్యగారు గునుపూడిలో ఓ మోస్తరు మోతుబరి రైతే. విశాల దృక్పథం, ఆధునిక భావాలు ఉన్నవారు. కాని ఆయన భార్య జానకమ్మ మాత్రం సంసారం, సంప్రదాయం అని కొట్టుకుంటూ ఉంటుంది. ఆమె మాట ఎవరైనా వింటేగా! పొలంలోకి కాఫీ, టిఫిన్లు ఏ పాలేరునైనా పంపించి తెప్పించుకొమ్మంటే వినేవాడు కాదాయన. భారతినే పట్టుకు రమ్మనేవాడు. రాటుకీ, పోటుకీ అలవాటు పడాలని ఆయన అభిమతం. 'మీరు దాన్ని మొగరాయుల్లా తయారు చేస్తున్నారు' అని మొత్తుకునేది జానకమ్మ.

గునుపూడి వీధి బడిలో నాలుగో క్లాసు చదివే భారతి ప్రక్కన కూర్చున్న మొగపిల్లల్ని పీశె గుద్దులు గుద్దేది. వాళ్లు లబో దిబో మంటుండేవారు. సీతారామయ్యగారింట్లో అప్పుడప్పుడూ ఓ మినపసున్నుండ తిని, గ్లాసుడు మజ్జిగ తాగి పోతూ, "జానకమ్మా! నీ కూతురు మహగడుగ్గాయి సుమా! అయినా ఈ రోజుల్లో అలానే ఉండాలిలే, లేకపోతే బతకలేం" అంటూండేవారు సుబ్బారావు మాస్టారు.

హైస్కూలు చదువులో అటు చదువులోనూ, ఇటు ఆటపాటల్లోనూకూడా ముందు ఉండడంతో భారతికి తిరుగులేకుండా పోయింది. అసలే ఊళ్లో మోతుబరి రైతు కూతురాయె. ఒకళ్ళిద్దరు కొంటె కుర్రాళ్ళు అల్లరి చేయబోయినా వాళ్ళకి గట్టిగా బుద్ధి చెప్పింది భారతి. ఆ 'గడుగ్గాయి' జోలికి పోవడం 'కొరివితో తలగోక్కున్నట్టే' అని వాళ్ళు తెలుసుకున్నారు.

హైస్కూలు చదువు పూర్తవడంతో, జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివి, డిగ్రీ కూడా చేస్తానని పట్టుపట్టింది భారతి. గునుపూడిలో కాలేజీ లేదు. తుని వెళ్ళి చదవాలి. జానకమ్మకి తన కూతురు పై చదువులు చదువుకోవడం ఇష్టమే. ఆ కాస్త చదువూ లేక తను కూపస్థ మండూకంలా ఎలా ఉండిపోయిందో అనుభవంలోకి వచ్చింది కదా! కాని పట్నవాసంలో, ఎదిగిన పిల్లని వంటరిగా వదిలి పెట్టి ఎలా చదివించడం? అసలే రోజులు బాగా లేవు. రకరకాల కథలు వింటున్నాం అని ఆమె భయం. కాని భర్త సీతారామయ్యగారు భారతి పక్షం కావడంతో తను వీగిపోయింది. ఫలితంగా భారతి తునిలో రెడ్ కాన్వెంటులో జాయినయ్యింది. వాళ్ళకి ప్రత్యేకంగా లేడీస్ హాస్టలుండడంతో సగం సమస్య తీరింది.

పల్లెటూరు వదలి పట్నవాసం వచ్చిన భారతికి ప్రపంచం కొద్దికొద్దిగా అవగాహనకి రాసాగింది. ఇటు పుస్తకాలూ, అటు నిత్యజీవితం తన లోకజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేస్తున్నాయి. పక్షికి కొత్తగా రెక్కలు రాగానే ఎగరాలన్న ఉబలాటం ఎక్కువైంది. 'స్త్రీవాదం', 'పురుషాధిక్యత' తన డిక్షనరీలో చోటు చేసుకున్నాయి. సహజంగానే అబ్బిన పెంకితనం దానికి తోడైంది. స్త్రీలపై అత్యాచారాలు, అణచివేత, ప్రతినిత్యం తన చుట్టూ ఉన్న వాతావరణంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. వాటి నెదిరించమని తన మనసు పదే పదే హెచ్చరిస్తోంది. మొదటి నుంచీ నిరాసక్తంగా పడి వుండే రకం కాకపోవడంతో కాలేజీలో అన్ని ఏక్టివిటీల్లోనూ తానై తిరుగుతూ అన్నీ అర్థం చేసుకుంటోంది భారతి. డిగ్రీలో కొచ్చేసరికి బాగా పాప్యులర్ అయింది. మిత్రులంతా ఏకమై విద్యార్థి సంఘానికి అధ్యక్షురాలిగా పోటీ చేయమన్నారు. విద్యార్థినులే కాక ఎందరో విద్యార్థులు కూడా సపోర్టు చేయడంతో తేలిగ్గా ఎన్నికైంది భారతి. ఓడిపోయిన స్టూడెంటు లీడరు ఆమెను 'గడుగ్గాయి' గా స్వీకరించి తోక ముడిచాడు. డిగ్రీ పూర్తి చేసిన భారతి బి.ఇడిలో ఎంట్రన్సు రాసి రేంకు తెచ్చుకుని, అదే కాలేజీలో బి.ఇడి కూడా పూర్తి చేసింది. ఇంకా ఏదో చేద్దామనే తపన ఉన్నా ఇంట్లో అమ్మ పోరు పడలేక అక్కడితో ఆపు చేసింది. తండ్రి కూడా ఇక తన బాధ్యత తీర్చుకునే తొందరలో ఉన్నట్టు కనబడ్డాడు - అదే వరాన్వేషణ.

భారతి తనుపెట్టిన షరతులు మేరకి తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లికి ఒప్పుకుంది. "ఇలా అయితే నీకీ జన్మకి పెళ్లి కాదు. ఆడది అన్నాక అణిగీ మణిగీ ఉండాలి. అవతలి వాళ్ళ షరతులు మనం తట్టుకోగలిగితే అదే పదివేలు. నువ్వట్టే పిచ్చి వేషాలెయ్యక, ఆ మూడు ముళ్లూ పడేవరకూ మేము చెప్పినట్టు నడుచుకో" అని మందలించింది తల్లి.

సంబంధాలు వస్తున్నాయి. పెళ్ళివారొస్తున్నారు. వెళ్తున్నారు. అమ్మాయికి మంచి అర్హతలున్నాయి. చక్కగా ఉంటుంది. ఓ విధంగా సంపన్న కుటుంబమే. కనుక చంకలు గుద్దుకుంటూ వస్తున్నారు. పెళ్ళి చూపుల్లోనూ, 'మిగతా విషయాలు మాట్లాడుకోవడం' లోనూ, ఎక్కడో బెడిసికొడుతోంది. ఇంటికెళ్ళి ఉత్తరం రాస్తామన్నవాళ్ళు 'జాతకాలు కుదరలేదు'

దని కబురెట్టేస్తున్నారున. సగం సంబంధాలు భారతి ధాటికి తట్టుకోలేకనే తిరిగిపోయాయంటే అతిశయోక్తి కాదు.

ఇలా ఉండగా సీతారామయ్యగారి దగ్గర బంధువొకాయన హైద్రాబాదు సంబంధం ఒకటి తీసుకొచ్చాడు. అబ్బాయి ఎం.ఎస్సీ చదివి ముంబైలో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబం అంతా ఆదర్శవాదులు. 'మీ అమ్మాయి అదృష్టవంతురాలైతే ఈ సంబంధం కుదురుతుంది అన్నాడాయన. పెళ్ళి చూపుల తతంగం మామూలుగానే ముగిసింది. "మిగతా విషయాలు మాట్లాడుకుందామా?' అన్నారు సీతారామయ్యగారు. 'అదేమీ అవసరం లేదు. మాకంటూ ప్రత్యేకమైన కోరికలేమీ లేవు. మీరు శాస్త్రోక్తంగా వివాహం జరిపించండి చాలు' అన్నారు పెళ్ళివారు. మరి కట్నకానుకలూ, ఇచ్చిపుచ్చుకోడాలూ...!" అంటూ నసిగింది జానకమ్మ. 'అవన్నీ ఏమీ అవసరం లేదు. మీ అమ్మాయి మాకు నచ్చింది. మా అబ్బాయి మీకు నచ్చాడు. సంతోషంగా, సంప్రదాయసిద్ధంగా అమ్మాయిని పంపండి చాలు' అన్నారు వారు. వారి ఉదార హృదయానికి, భారతి అదృష్టానికి మనసులోనే వెయ్యి దణ్ణాలు పెట్టింది జానకమ్మ.

ఉన్నట్టుండి భారతి బాంబు వేసింది. 'నేనొక్కసారి విడిగా అతనితో మాట్లాడాలి' అంది. 'సరే' అని వాళ్ళకా అవకాశం ఇచ్చారు పెద్దవాళ్లు. జానకమ్మ పై ప్రాణాలు పైనే పోయాయి. 'ఇంతా చేసి ఇది ఈ సంబంధాన్ని కూడా చెడగొట్టేలా ఉందిరా భగవంతుడా, దానికి కాస్త బుద్ధొచ్చేట్టు చేయిదేవుడా! అని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఆ వచ్చిన వరునికీ, భారతికీ సంభాషణ ఇలా సాగింది.

'ఊఁ! అయితే నేను నీకు నచ్చానన్నమాట'

'అవును'

'మరి నువ్వు నాకు నచ్చడం విషయం?'

'అది, ధైర్యం ఉంటే నువ్వు చెప్పవలసిన విషయం'

'నేను చాలా గడుగ్గాయిని. ఆ విషయం తెలుసా?'

'నేను గడుగ్గాయేతరుడిని. ఆ విషయం నీకు తెలియడం అవసరం'

'నేను ఫెమినిస్టుని'

'నేను హ్యూమనిస్టుని'

'నాది చాలా స్వతంత్రంగా జీవించాలనే ఆశయం'

'దానికి నా సహాయం, సహకారం సంతోషంగా లభిస్తాయి'.

'నాది చాలా చిత్రమైన మనస్తత్వం. అర్థం చేసుకోవడం కష్టం. ఉదాహరణకి, ఆ మధ్య ఎలక్షన్లో ఓటు వేయడానికి వెళ్ళి నేను వేలిముద్ర వేస్తానన్నాను. ఆ ఎలక్షనాఫీసరు చదువుకున్నవాళ్ళు సంతకమే చేయాలన్నారు. నేను ససేమిరా ఒప్పుకోలేదు. నాకు సంతకం చేయడం రాదు. వేలిముద్రే వేస్తాను, ఆక్షేపణ ఏంటి? అని వాదించాను. ఆయన ఒప్పుకోక తప్పలేదు."

'ఏడ్పించర్లంటే నాకూ థ్రిల్లింగ్‌గానే ఉంటుంది.'

'పెళ్ళయ్యాక కావాలంటే ఉద్యోగం చేస్తాను. ఇష్టం లేకపోతే మానేస్తాను. నన్నెవరూ నిర్బంధించకూడదు. నేనెలాంటి దానినంటే, చెయ్యమంటే మానేస్తాను. మానెయ్యమంటే చేస్తాను.'

'మన సంప్రదాయంలో ఉద్దాలకుడు - చండికా కూడా చక్కని సంసార జీవితం గడిపినవారే!'

'పెళ్ళాయ్యాక కూడా నేను నిన్ను 'నువ్వు' అనే సంబోధిస్తాను. ఏమండీ, గీమండీ' అని మన్నించడం నా కసహ్యం'.

'నేనూ నిన్ను 'నువ్వు' అనే పిలుస్తాను. 'ఒసే' అని పిలవడం నాకు పరమ అసహ్యం.

'నాలాంటి మొండి ఘటాన్ని కట్టుకోవడంలోని అంతరార్థం?'

'ముద్దబంతి పూవుని ఇంగ్లీష్ రోజ్‌గా మారుద్దామనే బలీయమైన కోరిక'.

ఈదురుగాలికీ, పెను తుపానుకీ ఎదురు నిలిచే పెద్ద వృక్షాలయితే కూకటి వేళ్ళతో నేలకొరిగిపోతాయి. నిగర్వంగా, గాలి ఎటు వీస్తే అటు వంగే తుంగ మొక్కని ఏ తుపానూ పెకలించలేదు. తుపాను సృష్టించి, దుమారం రేపుదామనుకున్న భారతి తుంగమొక్కలాంటి వరుణ్ణి కదిలించకపోయింది. 'సరే! ఆ సంగతీ చూద్దా' మనుకుందో ఏమో భారతి ఈ పెళ్ళికొప్పుకుంది. ఆ వరుడు కృష్ణారావు.

ఉన్నంతలో సంప్రదాయ సిద్ధంగా, ఘనంగానే పెళ్లి చేసి భారతిని అత్తారింటికి పంపించారు పుట్టింటివారు. అత్తింట్లో కొత్త కోడల్ని కాలు కింద మోపకుండా ఆదరించారు అంతే! రాజభోగాలనుభవిస్తూ, విప్లవం ఎవరి మీద లేవదీస్తుంది భారతి? ఓ విధంగా నిరుత్సాహం చెందింది. లోకంలో అంతా పుస్తకాల్లో చదివినట్టు, టీ.వీ. సోప్‌షోస్‌లో చూసినట్టూ ఉంటుందని నమ్మింది. మొగాళ్లందరూ చండశాసనులు. అత్తారింట్లో కోడల్ని రాచిరంపాన పెడతారు. ఆడది భర్త దగ్గర పాద దాసిగాపడి ఉండాలి. ఇదంతా అన్యాయం, స్త్రీ స్వాతంత్ర్యాన్ని అణచివేయడం కనుక వాటిని వ్యతిరేకించి ఉద్యమం లేవదీయాలని కలలు కనేది భారతి. కానీ ఇప్పుడు చూస్తుంటే కథ అడ్డం తిరిగినట్టుంది. అయినా వేచి చూడాలి అని నిశ్చయించుకుంది.

✷✷✷

క్రొత్తలో పుట్టినింటికీ, మెట్టినింటికీ, రాకపోకలూ, నోములూ, వ్రతాలూ వంటివి పూర్తయ్యేవరకూ ఆగి కృష్ణారావు, భారతిని ముంబైకి ప్రయాణం చేశాడు. ఓ శుభముహూర్తాన కొత్త కాపురానికి కావలసిన సరంజామాతో ముంబైలో అద్దె కొంపలో కాలు పెట్టింది భారతి. గునుపూడి నుంచి తుని, హైద్రాబాదుల మీదుగా ముంబై చేరేసరికి ఆమె దిక్చక్రంవిస్తృతమై జీవితం అంటే అవగాహన ఏర్పడుతోంది. పుస్తకాల్లో చదివే కాల్పనిక జగత్తుకీ, నిత్య జీవితానికీ ఉన్న వ్యత్యాసం అర్థం అవుతోంది. బాధాసర్పదష్టులు, దగాపడిన తమ్ముళ్ళే కాకుండా కడుపు నిండిన వాళ్ళూ, తిన్నది అరక్క అజీర్తితో బాధపడేవాళ్లూ కూడా ఇదే ప్రపంచంలో ఇరుగు పొరుగుగా బ్రతుకుతున్నారని తెలుసుకుంది, ప్రత్యక్షంగా చూసింది.

ముంబైలో, మాహిమ్ క్రీక్‌కి దగ్గరగా, పదో అంతస్తులో ఎపార్టుమెంటు. కిటికీలోంచి చూస్తే కుళ్ళు మోసుకుపోయే కబంధహస్తాల్లాంటి డ్రైనేజి పైపులు, కలుషితమైన వాతావరణంలో కుళ్ళిపోయిన గాలి. ఉదయం ఆఫీసుకెళ్తే రాత్రి పదింటికి గాని ఇంటి మొహం చూడని భర్త, రేషను షాపులో క్యూ, భాష తెలియక తికమక, చర్చిగేటు దగ్గర జనారణ్యంలో దారి తప్పి, భార్యాభర్తలు మళ్లీ కలుసుకోవడం. అబ్బో! అయిదేళ్ళయేసరికి ఓ జీవితకాలపు అనుభవాన్ని గడిచింది భారతి. ఇద్దరు ఆడపిల్లలు కూడా పుట్టారు, తన కోరిక తీరా! ఎందరో కొత్తవాళ్ళు పరిచయం అయ్యారు. కానీ, ఒక జంట మాత్రం మరీ సన్నిహితులయ్యారు. ఆఫీసులో కృష్ణారావుకి సహోద్యోగి మంగపతీ, భార్య అలివేలూను. మంగపతికా పేరు భారతే పెట్టింది. అతని ఆఫీసు పేరు అదేదో ఉండాలి. వారిద్దరిదీ చాలా అన్యోన్యమైన దాంపత్యం. "మీరెప్పుడు సరదాకి కూడా పోట్లాడుకోరా? అసలు మీ ఇద్దరికీ భేదాభిప్రాయాలంటూ రావా?" అని ఆశ్చర్యంగా అడుగుతూంటుంది భారతి వాళ్ళని.

మంగపతికీ, భారతికీ సాహిత్యం అంటే అభిమానం. మంగపతి భాషతో గారడీలు చేస్తూ ఉంటాడు. బెంగాలీలు 'లతామంగేష్కర్'ని 'లోటా మంగేష్కర్' అంటారనీ, సీతారామయ్యని ముస్లింలు 'సత్తార్ మియ్యా' అని పలుకుతారనీ, క్లెమెంట్ అట్లీ తెలుగువాడే అనీ, అతని అసలు పేరు 'అత్తిలి కామేశం' అనీ సరదాగా మాట్లాడుతూ తన చుట్టూ వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చగలడు. గేయ రచన కూడా చేస్తాడు. అలివేలు వంటలు చాలా రుచికరంగా చేస్తుంది. కృష్ణారావుకి జిహ్వాచాపల్యం హెచ్చు. స్వీట్లు అంటే పడి చస్తాడు. అలివేలు లాంటి భార్యను పొందిన మంగపతిని అదృష్టవంతుడని పొగుడుతాడు. ఇలా ఆ జంటలు స్నేహానురాగాలతో తరచుగా కలుసుకుంటూ, నాలుగు గోడల మధ్యా మానస సరోవరాన్ని సృష్టించుకుని ఆనందిస్తూంటారు.

* * *

ఇన్ని ఉన్నప్పటికీ భారతి మనసులో ఏదో అసంతృప్తి, తను జీవితం పట్ల అనుకున్నదొకటీ, ఇప్పుడు జరుగుతున్నది మరొకటీ కావడంతో అదోకలాంటి నిరుత్సాహం ఆమె నావహించింది. కోడలు పిల్లని నిప్పంటించి చంపేద్దామని కిరసనాయిలు ఇంట్లో దాచిపెట్టిన అత్తగారు కిటికీలోంచి బైటికి చూస్తే శీలాన్ని అనుమానించి హింసించే భర్త, చక్కగా అలంకరించుకుని తిరిగితే వన్నెలాడి అని ఆడిపోసుకునే సంఘం. జీవితానికి తను చెప్పుకున్న అర్థం అది. వాటన్నిటినీ ఎదిరించి పోరాడాలనీ, ఓ విప్లవం లేవదీయాలనీ ఉబలాటపడింది భారతి. కానీ అలాంటిదేమీ జరగలేదు. కార్గిల్ సరిహద్దుల్లో బోఫోర్సుగన్ రెడీ చేసుకుని వెళ్ళిన సైనికుడు, ప్రత్యర్థులు ఎల్.ఓ.సి.కి అటువైపు పారిపోయి దాక్కుంటే నిరుత్సాహ పడినట్టు హతాశురాలైంది. కానీ ఏమైనా చేయాలన్న ఆవేశం ఉంది ఆమెలో. ఏమీ చేయలేకపోతున్నానన్న ఉక్రోషం ఉంది. ఇలా ఏ గాలి వీస్తే ఆ గాలికి కొట్టుకుపోవడమే జీవితమా? అన్న ఆవేదన కలిగింది. ఇలాంటి విచిత్రమైన, ఏదో తెలియని వెలితితో, వ్యథతో భారతి కొట్టుమిట్టాడుతున్న రోజుల్లో ఓనాడు....

* * *

చంటి దానికి విరేచనాలు అవుతున్నాయి. పెద్దదానికి అప్పటికి మూడు రోజుల్నుంచి జ్వరం. భారతి ఒక్కర్తే ఇద్దరితో వేగలేకపోతూంది. కృష్ణారావు ఒకటి రెండు రోజులు ఆఫీసుకి సెలవు పెడితే బాగుండుననిపించింది. ఆ విషయమే అతనితో అంది, ఆ రోజు ఆఫీసుకు బయల్దేరుతూండగా.

"ఈ రోజు నువ్వు సెలవు పెట్టేయకూడదూ!"

"ఈ రోజు కంపెనీ డైరెక్టరు వస్తున్నాడు. సెలవు దొరకదు. పైగా సాయంత్రం రావడం ఆలస్యం కావచ్చు కూడా!"

"చూస్తున్నావుగా ఇంట్లో నరకం. నేనొక్కర్తినే పడలేను".

"పడలేనంటే ఎలా? కొంచెం ఓర్పు వహించాలి".

"అంటే అర్థం? నాకొక్కదానికేనా బాధ్యత? నువ్వు అసలు ఇంటి విషయం పట్టించు కోనక్కర్లేదా?"

"అది కాదు భారతీ! చెప్తుంటే అర్థం చేసుకోవేం?

"ఏది కాదు? ఏం అర్థం చేసుకోవాలి? పొద్దుట్నుంచి సాయంత్రం దాకా వీళ్ళిద్దర్నీ సంబాళించుకోవడం నా వల్ల కాదు. నా తల ప్రాణం తోక కొస్తోంది. నువ్వీ ఒక్కరోజు ఆఫీసుకెళ్ళకపోతే కొంపేం మునగదు".

"మునుగుతుందనేగా చెప్తున్నాను. మామూలు రోజులు వేరు - ఈ రోజు నేను వెళ్ళక తప్పదు. చాలా ముఖ్యం".

"ఇక్కడ జబ్బుతో బాధపడుతున్న సంసారం కంటే అదే నీకు ముఖ్యమన్నమాట!".

"అబ్బ! నీకెలా చెప్పేది భారతీ! ఈ రోజుకెలాగో సర్దుకో. రేపు చూద్దాం".

మాట్లాడుతూనే గుమ్మం దాటి లిఫ్టు దగ్గరికి వచ్చాడు కృష్ణారావు. భారతి కోపం తారస్థాయికి చేరుకుంది. 'వెనకాలే తనువస్తూ, "అయితే నాకింక చావే గతి! నీ పిల్లల్ని నీ కప్పజెప్పినే వెళ్లిపోతాను" అని ఆఖరిసారిగా హెచ్చరించింది.

"పోతాను! పోతాను! అని బెదిరించితే భయపడతాననుకున్నావా? ఎక్కడికెళ్ళగలవు? వెళ్ళు! నా పిల్లల్ని నేనామాత్రం పెంచుకోలేకపోను!" అని అంటూ లిఫ్టులో క్రిందికి దిగిపోయాడు కృష్ణారావు.

భారతికి పట్టలేని ఉక్రోషం వచ్చింది. 'నా బాధని అర్థం చేసుకోకుండా ఎంత నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు! మొగాడు ఆఖరికి తన అసలు రూపంలో సాక్షాత్కరించాడు. వీడికి తగిన శాస్తి చేయాలి' అని నిర్ణయించుకున్న భారతి కాగితం కలం తీసుకుని.

"వెళ్లిపోలేనని కదా నీ ధైర్యం! ఇదుగో వెళ్లిపోతున్నాను. ఏం చేస్తావో చేసుకో! ఇక నీకూ నాకూ సరి. నన్ను వెదికే ప్రయత్నం కూడా చేయడం వ్యర్థం. ఎందుకంటే రాత్రి నువ్వింటికి వచ్చేసరికి నేను మాహిమ్ క్రీక్‌లో మునిగి చాలాదూరం వెళ్లిపోయి ఉంటాను" అని రాసి పెట్టేసి కోపంగా క్రిందికి దిగిపోయింది.

* * *

కృష్ణారావు ఆఫీసుకి వెళ్ళాడేగాని ధ్యాస అంతా ఇంటి మీదే ఉంది. భారతి పట్టుదల తనకి తెలియంది కాదు. ఎంత ప్రయత్నించినా మనసు పని మీద లగ్నం కావడం లేదు.

ఉదయం జరిగిన మాటలే మాటి మాటికీ చెవుల్లో రింగుమంటున్నాయి. భారతి మాట అంటే చేసే తీరుతుంది. కొంపతీసి, ఆవేశంలో మాహిమ్ క్రీక్‌లో....ఇలా ఊహ వచ్చేసరికి ఇక ఆగలేకపోయాడు. ఎలాగో లంచ్ టైము వరకూ గడిపి, ఆఫీసులో బ్రతిమాలుకుని, ఇంటికి చేరుకున్నాడు. మెయిన్ డోరు లాక్ చేసి లేదు. పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. భారతి ఇంట్లో లేదు. అనుకున్నంతా జరిగిందని నిలువునా కూలిపోయాడు. టేబులు మీద చీటీ చూసి, చదువుకుని నివ్వెరపోయాడు. శరీరం ఆపాదమస్తకం కంపించసాగింది! 'ఎంత ఘోరానికి తెగించావు భారతీ!' అనుకున్నాడు.

కర్తవ్యం ఏమీ తోచలేదు. అసలు మెదడు పని చేయడం మానేసింది. ఆపదలో ఆత్మీయుడైన మంగపతి జ్ఞాపకం వచ్చాడు. వాయువేగంతో తిరిగి ఆఫీసుకు వెళ్లి మంగపతిని ఇవతలికి తీసుకొచ్చి "భారతి కొంప ముంచింది" అన్నాడు. అతని కంగారు చూసి, ఏదో పెద్ద ప్రమాదమే జరిగిందని గ్రహించి మంగపతి, "ఏం జరిగింద"ని అడిగాడు. "అవన్నీ తరువాత చెప్తాను. ముందు నువ్వు స్కూటరు తీసి నాతో రా!" అని తొందర తొందరగా ముందు నడిచాడు. కృష్ణారావు. మనిషి ఉన్మాదిలా అయ్యాడు. ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు. పెదవులు తడి ఆరిపోయాయి. పూనకం వచ్చిన వాడిలా ఊగి పోతున్నాడు. మనిషి మనలో లేడు. ఈ పరిస్థితిలో స్కూటరు మీద పిలియన్‌గా అతన్ని కూర్చోబెట్టడం ఏక్సిడెంటు కొనితెచ్చుకోవడమే అని మంగపతి ఒక టాక్సీని పిలిచి, కృష్ణారావుని ఎక్కించి తనూ ఎక్కి కూర్చున్నాడు. "అర్జంటుగా మాహిమ్ క్రీక్‌కి పోనియ్యి" అన్నాడు కృష్ణారావు.

అక్కడ టాక్సీ ఆగగానే తలుపు తీసుకుని బైటికి ఉరికి, కృష్ణారావు అంతా కలియజూసి అన్నాడు - "లేదు! భారతి ఇక లేదు!" రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని ఏడవసాగాడు. మంగపతి అతన్ని ఓదార్చి అసలేం జరిగిందో చెప్పమని అడిగాడు. కృష్ణారావు ఉదయం జరిగిన ఘర్షణ అంతా చెప్పి "భారతిని నువ్వెరగవు. ఆమె అన్నంత పని చేసి తీరుతుంది. నాదే తప్పు. నేను బాధ్యతగా ప్రవర్తించి ఉండవలసింది" అన్నాడు.

"నువ్వలా కంగారు పడకు. భారతి గడుగ్గాయి కావచ్చు కాని, పిరికిది మాత్రం కాదు. సమస్య వస్తే పోరాడుతుంది. కాని పారిపోదు. నా మనసు మాత్రం కీడును శంకించలేదు. మనం ఇంటికి వెళ్దాం పద" అన్నాడు మంగపతి. దగ్గర్లోనే ఉన్న ఎస్.టి.డి. బూత్ నుంచి తన ఇంటికి ఫోను చేసి, విషయం చెప్పి, అలివేలుని భారతి ఇంటికి వెళ్లి పిల్లల్ని చూస్తుండమని చెప్పాడు.

"రాను. నేను ఇంటికి ఏ ముఖం పెట్టుకుని వెళ్లగలను! ఇలా రైలు పట్టాలవెంటే నడుస్తూ పోతే భారతి దొరకొచ్చు" అంటూ పిచ్చిగా రైలు పట్టాల మీద నడవసాగాడు కృష్ణారావు. మంగపతి అతన్ని నీడలా అనుసరిస్తూ, కొంత సేపటికి అతనికి నచ్చజెప్పి, ఇంటికి తీసుకురాగలిగాడు.

ఇంట్లో పిల్లలిద్దర్నీ, అలివేలునీ చూసి ఇంకా బెంబేలు పడిపోయాడు కృష్ణారావు. భారతి ఇంట్లో లేదు. అక్కడ కనిపించలేదు. రేపటి పేపర్లో 'మాహిమ్ క్రీక్‌లో శవం' అని

పెద్ద అక్షరాల్లో వార్త. అది తల్చుకుని హతాశుడయ్యాడు. మిత్రుణ్ణి కౌగలించుకుని, ఏడుస్తూ "చెప్పు బ్రదర్ నేనెలాంటి శిక్షకి అర్హుడిని?" అన్నాడు. కుర్చీలో కూలబడి తనను తాను సంబాళించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"నాదే తప్పు! నేనే తొందర పడకుండా ఉండవలసింది అంతా అయిపోయింది. అర్థం లేని పిడివాదాల్ని ప్రచారం చేస్తూ, దుర్మార్గానికీ, దుశ్చర్యలకూ లింగ భేదాన్ని సృష్టించి, సంప్రదాయాల వలలో చిక్కుకుని ఏ కొద్ది మందో చేస్తున్న దురన్యాయాన్ని భూతద్దంలోంచి చూపిస్తూ, భారతి లాంటి సున్నితపు మనసుల్ని విషపూరితం చేస్తున్నాయి నేటి ప్రచార సాధనాలు. అదంతా నిజం కాదనీ, ప్రపంచంలో కొన్ని కోట్లమంది లేమిలోనూ, కలిమిలోనూ కూడా సామాన్య జీవనం సాగిస్తున్నారనీ, భారతి లాంటి అమాయకురాలి మనసుని మార్చి, తెలియజెప్పాలని నేను చేసిన యజ్ఞం అంతా వృధా అయిపోయింది" అని వాపోతున్నాడు కృష్ణారావు. అతన్ని ఓదార్చాలని ప్రక్కనే కూర్చుని ప్రయత్నం చేస్తున్నాడు మంగపతి.

* * *

క్షణికమైన ఉద్రేకంలో చీటీ రాసి బల్ల మీద పెట్టి చరచరా నడుస్తూ వీధిన పడిన భారతి మనసులో పరిపరి విధాల ఆలోచనలు.

'అనవసరంగా కృష్ణ మనసును నొప్పించానేమో! నిజంగానే ఆఫీసులో ఈ రోజు అత్యవసరం అయిన పని ఉండవచ్చు. ఒక దగ్గర తల అమ్ముకున్న తర్వాత వాళ్లూ ఈ ఉద్యోగస్తుల నుంచి ఏదో ఆశిస్తారు కదా! అయినా కృష్ణా ఎన్నిసార్లు తను కోరకుండానే సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోలేదు! పెళ్ళిరోజున, తన పుట్టినరోజున ఇలా ఎన్నోసార్లు, తనన్నా, పిల్లలన్నా ప్రాణం పెడ్తాడు. ఇన్నాళ్ళ వైవాహిక జీవితంలో ఎన్నడూ కృష్ణ హద్దుమీరి ప్రవర్తించిన సంఘటన లేదు. ఆత్మావలోకనం చేసుకుంటే ఇంకా తనలోనే కొన్ని లోపాలున్నాయి. కృష్ణలాంటి సహృదయుడు తన భర్త కావడం నిజంగా తన అదృష్టం. అలాంటిది అతని మనస్సు నీనాడు నేను కష్టపెట్టాను. నేనే తొందరపడ్డానేమో! డాక్టరు దగ్గరకెళ్ళి పిల్లలకి మందులు తీసుకుని వేగంగా ఇంటికెళ్ళి, రాసిపెట్టిన చీటీ అంటించి పారేయాలి. కృష్ణ రాత్రికి కానీ ఇంటికి రాడు. డిన్నర్‌లో డెస్సెర్టుగా 'గులాబ్‌జామ్' లు చేయాలి. అవంటే కృష్ణకి చాలా ఇష్టం' - ఇలా ఆలోచిస్తూ ఫ్యామిలీ డాక్టరుండే డిస్పెన్సరీకి వచ్చింది. పిల్లల అనారోగ్యం డాక్టరుకి చెప్పి, ప్రిస్కిప్షను ప్రకారం మందులు కొనుక్కొని గబగబా ఇంటికి తిరిగి వచ్చింది.

ఇంట్లో అడుగు పెట్టిన భారతి నిర్జీవుడిలా పడి వున్న భర్తనీ, చేష్టలుదక్కి ఉన్న పిల్లల్నీ, వారిని పట్టుకుని బుజ్జగిస్తున్న మంగపతీ, అలివేలుల్నీ చూసి నిశ్చేష్టురాలైంది. ఏం జరిగిందో ఊహించుకోవడం కష్టం కాలేదు భారతికి. ఆమెను చూడగానే ఒక్క ఉదుటున లేచి వచ్చిన కృష్ణారావు ముందు, దోషిగా గ్రుడ్ల నిండా నీరు గ్రక్కుకుని నిలబడింది. నిర్లిప్తంగా ఆమె వైపు చూస్తూ "ఎంత పని చేశావు భారతీ!" అని మాత్రం అన్నాడు కృష్ణారావు. ఒకే ఒక్క బలహీనమైన క్షణంలో తన తప్పు గ్రహించి కాళ్ల మీద పడబోయింది భారతి. అంతరంగంలో అహమే కాక, బాహ్యంగా మంగపతీ, అలివేలూ కూడా అడ్డు తగిలారు.

"రా! భారతీ! అలా నిలబడి పోయావేం? మేమేమీ కొత్తవాళ్లం కాముగా!" అంది అలివేలు ఏమీ జరగనట్టుగా. ఉప్పెనలా కట్టలు తెంచుకు రాబోతున్న దుఃఖానికి ఆ మాటలు ఆనకట్టలయ్యాయి. అలివేలు భారతిని చేయి పట్టుకుని కిచెన్‌లో నడిపించుకు పోయింది. మనసు తేలికపడిన కృష్ణారావూ, మంగపతీ, పిల్లలూ హాలులో మిగిలారు.

కిచెన్‌లో కాఫీ కలుపుతున్నంత సేపూ, అలివేలు మాత్రమే మాట్లాడింది.

"భారతీ 'థ్రిల్' అనేది మానసికమైన ఒక భావన మాత్రమే! నవలల్లోనూ, కథల్లోనూ, సినిమాల్లోనూ, సీరియల్సులోనూ జరిగే థ్రిల్లింగ్ సంఘటనల్ని చదివి చూస్తే కలిగేది అలౌకికానందం. హీరో దగ్గర విలన్ చావు దెబ్బలు తిని ఒళ్లంతా రక్తాలు కారుతుంటే, అది కేవలం టోమటో కెచప్ అన్న మాట మరిచి, మనం ఆనందిస్తాం. 'క్యాసీన్ హై!' అని పొంగిపోతాం. చేయి తిరిగిన చిత్రకారుడూ గాడిద చిత్రాన్ని అతి సహజంగా చిత్రిస్తే ఎంత బాగుందో అని ముద్దు పెట్టుకుంటాం. కాని నిజ జీవితంలో విలన్ దుస్థితిని చూస్తే జాలేస్తుంది. గాడిదని చూసి అసహ్యించుకుంటాం. కల్పన వేరు, జీవితం వేరు. థ్రిల్ అనేది కల్పనలో గొప్పగా ఉండొచ్చు కాని నిజ జీవితంలో కాదు. ఈ నాలుగు ఘడియలూ మీరిద్దరూ అనుభవించిన యమయాతన ముసలాళ్ళయ్యాక చెప్పుకుంటే థ్రిల్లింగ్‌గానే ఉంటుంది. హాల్లో మొగుళ్లు కాఫీల కోసం ఎదురు చూస్తుంటారు పద!"

ట్రేలో పెట్టి తెచ్చిన కప్పుల్లో ఓ కప్పు కాఫీ భారతి మంగపతికి అందించింది. అలివేలు చేతిలో కప్పు కృష్ణారావు అందుకున్నాడు.

"ఆహా! చాలా రిఫ్రెషింగ్‌గా ఉంది కాఫీ!" అన్నాడు మంగపతి కాఫీ తాగడం ముగించి.

"అలివేలే కలిపింది" అంది భారతి.

"అదా సంగతి! మహాచేదుగా ఉంటే ఎందుకో అనుకున్నాను" అన్నాడు మంగపతి.

"నాకిలాగే ఇష్టం. కాఫీ చాలా బాగుంది" అన్నాడు కృష్ణారావు.

"పొరుగింటి పుల్లకూర" అంది, ముక్కూ, నోరూ చిట్లించి పళ్ళు నూరుతూ భారతి.

"ఇకమేం వెళ్లివస్తాం!" అన్న దంపతుల్ని అగమనలేదు భారతి. వారిని సాగనంపి, తిరిగి వచ్చిన కృష్ణారావు, కోపాన్ని తొక్కి పెట్టేసి ముందుకి చొచ్చుకు వచ్చిన చిరునవ్వుతో "గడుగ్గాయి" అన్నాడు.

"కాదు ఇంగ్లీష్ రోజ్!" అంది భారతి.

పిల్లలిద్దరూ తెల్లమొహం వేశారు అర్థం కాక.

*